ఓం హ్రీం శ్రీం



సూతమహర్షి, వైశ్యమునులకు, వైశ్యులకు పూర్వ ఇతిహాసమును విశదీకరించుట

# శ్రీవాసవి కన్యకా దేవి పురాణము

## ప్రథమాధ్యాయము

### సాలంకాయనుని ఆశ్రమమునకు మణిగుప్తాదుల ఆగమనము :

పరమపావనమైన గోదావరి నదీతీరమున వివిధ ఫలవృక్షములతో విరాజిల్లుచు, శుకపికకేకీ విహంగాదుల సుమధుర కూజితములతో వీనుల విందుగావించుచు, సాయంప్రాతః కాలములందు చేయబడు హోమముల ఆజ్యధూమ పరిమళముతో నిండినదై, నానావిధ పుష్పపరాగ సంభరితమై, మిక్కిలి ప్రశాంతమై విరాజిల్లు ఒక ఋష్యాశ్రమము కలదు. ఆ ఆశ్రమములో తన శిష్య గణములచే నిరంతరము

వేదవేదాంగములను షట్ఛాస్త్రములను, పురాణేతిహాసములను నియమముతో పఠింపజేయువాడును, వేదవేదాంగ పారంగతుడును, తపోరాశియు, సాక్షాత్ బ్రహ్మదేవునివలే తేజరిల్లువాడునునైన సాలంకాయనుడను ఋషి విలసిల్లుచుండెను. ఒకనాటి ప్రభాత సమయమున మహానుభావులును, సత్యసంధులును, తపోధనులును, వేదవిదులను, క్రోధమును జయించినవారును, సంయమివరేణ్యులునునైన మణిగుప్తాది వైశ్యోత్తములు ఆ సాలంకాయనుని దర్శించు కోరికతో శుభప్రదమైన ఆయాశ్రమమునకు అరుదెంచిరి.

విద్వద్వరేణ్యుడైన సాలంకాయనుడు వారిని మిక్కిలి ఆదరాభిమానములతో ఆహ్వానించి, అర్ఘ్యపాద్యమధుపర్కాదులనొసగి దర్భాసనములపై ఆసీనుల గావించెను. అటుపై అనురాగ పూరితములైన మధురవచనములతో ఓ "వైశ్యోత్తములారా! మీరు కుశలమే గదా? మీరాకతో మాకు పరమానందమైనది. మీరెచ్చటి నుండి ఎచ్చటకు వెళ్లుచూ ఇక్కడికి విచ్చేసినారో తెలపవలసినది." అని ఆత్మీయతతో నడిగెను. అదివిన్న మణిగుప్తాదులు "ఓ గురూత్తమా! మేము తీర్థయాత్రా సక్తులమై జ్యేష్ఠశైలము నుండి బయలుదేరి, హిమవంత, హేమకూట, పారియాత్ర, వింధ్యాచల, స హ్యాచల, సురాచల, వేంకటాచలాది మహా పర్వతములను దర్శించితిమి, మోక్షప్రదములైన అయోధ్య, మధుర, మాయ, కాశి, కంచి, అవంతిక మొదలగు పుణ్యక్షేత్రములను సేవించితిమి. లోకపావనములైన, గంగ, యమున, సరస్వతి, నర్మద, సింధు, శరధృతి, చంద్రభాగ, శరావతి, గోమతి, కావేరి, తామ్రపర్ణి, బాహుద, రేవా, కృష్ణవేణి మున్నగు నదులలో స్నానమాచరించితిమి. హిందూ మహాసముద్రమునందు గ్రుంకులిడి బ్రహ్మకుండ తీర్థసేవనముతో మా యాత్రను ముగింపదలచి, భవనివారకములైన తమ పాదారవిందముల సన్నిధికి చేరుకున్నాము. మీ దర్శన భాగ్యము వలన ధన్యులమైనాము.

ఓ మహాత్మా! ఇపుడు మీ నుండి అత్యంత పుణ్య ప్రదమైన ఒక చరిత్రను వినవలెనని మిక్కిలి కుతూహలపడుచున్నాము. ఇపుడు వైశ్యుల యొక్క వంశకథ వినదగియున్నది. ఓ గురూత్తమా! పరమేశ్వరి, పరాంబిక, యోగమాయా, కన్యయని పలునామములతో కీర్తింపబడుచున్న ఆదిశక్తి మా భాగ్యవశమున వైశ్యవంశములో 'వాసవీకన్యక' యను పేరుతో ప్రభవించినదనియు, మా పూర్వులా కన్యకతో గూడి ఒక నిరంకుశ ప్రభుత్వమునకు నిరసన దెలుపుచు మహోద్యమము నడిపి, అగ్నిలో ప్రవేశించి ఆత్మార్పణము గావించిరనియు, జగన్మాతయైన శ్రీవాసవీ కన్యకాదేవి యీ కలియుగములో వినూతన విధానముతో ధర్మసంస్థాపనము చేసినదనియు పెద్దలు పరిపరివిధముల చెప్పగా వినియున్నాము. మా పూర్వవైశ్యులు తొలి కైలాస వాసులనియు, కైలాసపతియొక్క ఆదేశానుసారముతో కళ్యాణార్థమైవారు భూలోకమునకు వచ్చిరనియు మా పెద్దలు చెప్పిరి. నేడు తమరు ఆ వైశ్య వంశచరిత్రను, కన్యకావతారతత్వమును, ఆ దేవి యొక్క జీవనగాధను మాకు విశదముగ తెలియజేయుడని మిక్కిలిగా ప్రార్థించుచున్నాము. దయాసముద్రులైన తమరు వాత్సల్యముతో ఆ సమస్త విషయములను సవిస్తరముగ మాకిపుడు వినిపింపుడు. అందుకు తమరే సమర్థులు అని వినయవినమత శిరస్సులై వేడుకొనిరి.

## నైమిశారణ్యవర్ణనము - పురాణ సంఖ్యా కథనము : -

అంతట సాలంకాయనుడు వారి వినయమునకు మిక్కిలి సంతసించినవాడై "ఓ వైశ్యోత్తములారా! పరమ పవిత్రము పాపనాశకము శుభప్రదమునైన మీ వంశచరిత్రను మరియు మోక్షప్రదమైన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దివ్యగాథను మీకిప్పుడు చెప్పుచున్నాను. ఇది సర్వసౌభాగ్య సంపత్కరమైనది. కైవల్యదాయకమైనది. ఈ పుణ్యగాథలను వినువారును, పఠించువారును ధన్యులగుదురు. వారి యిండ్లలో ధన

కనక వస్తువాహనాదులు కోకొల్లలుగ చేరగలవు. కల్పతరువు వారి పెరటితోటలో వెలయుగలదు. వారి గోశాలలో కామధేనువు వసించును. వారి చేతలలో చింతామణి విలసిల్లును. ఇది ముమ్మాటికిని సత్యము. కనుక మీరు అత్యంత భక్తి శ్రద్ధలతో శ్రవణము చేయుడు" అని ఈ విధముగా చెప్పనారంభించెను.

"ఓ పుణ్యశీలులారా! బ్రహ్మర్షి మండలితో శోభిల్లునదై ఎల్లప్పుడును వేదనాదములతో ప్రతిధ్వనించు నైమిశారణ్యమను పుణ్యవనమందు, పవిత్ర గోమతీనదీతీరమున ఒక గొప్ప ఋష్యాశ్రమము కలదు. నైమిశారణ్య మహత్వము అత్యంత విశిష్టమైనది. పూర్వము అత్రి, భృగు, వశిష్ట, మరీచి, గాలవాది ఋషి ప్రముఖులు విధాత యొద్దకుపోయి, తాము నిర్విఘ్నముగ తపస్సు చేసికొనుటకనువైన స్థలమును చూపవలసినదని ఆ బ్రహ్మను ప్రార్థించిరి. అపుడా విరించి "మనోమయము" అను ఒక చక్రమును సృష్టించి దానిని భూమిపై దొర్లించి, ఆ మునులతో "ఓ మునులారా! మీరీ చక్రము వెంట పొండు. దీని ఇరుసుకట్టు విరిగి యీ చక్రమెక్కడ పడిపోవునో ఆ ప్రదేశమే మీ తపశ్చర్యకనుకూలమైనదనియు, అచ్చట కలి ప్రవేశించలేడనియు, అదే అత్యుత్తమ పుణ్య స్థానమనియు గుర్తింపుడు" అని చెప్పి పంపించెను. ఆ చక్రము పోయిపోయి ఒక అరణ్యములో పడిపోయినది. "నేమి" యనగా చక్రపు ఇరుసుకట్టు. "నేమిః శీర్యతేస్మి న్నితినైమిశః" అను వ్యుత్పత్తిచే ఆ అరణ్యమునకు నైమిశారణ్యమని పేరు గలిగినది. నైమిశారణ్యములో తపోయజ్ఞములకెన్నడును విఘ్నములు వాటిల్లవు. ఇది ఆ స్థల మహాత్మ్యము. పుణ్యనిలయమైన ఆ అరణ్యనందు నెమళ్ళు, పాములు, ముంగిసలు, పులులు, గోవులు మొదలైన జంతువులన్నియు సహజమైన పరస్పర జాతి వైరమును మరచి స్నేహ వాత్సల్యములతో కూడినవై చరించుచుండును. ఆ మహత్తరారణ్యమున బ్రహ్మ విదులైన మహర్షులు సుదీర్ఘకాలము జరుగు సత్రయాగమను మహాయజ్ఞమును చేయనారంభించిరి. వేదవేదాంగ పారంగతులును, బ్రహ్మజ్ఞాన సంపన్నులును, లోక

సంరక్షనాభిలాషులును, కరుణామయులునునైన శుక, శక్తి, వ్యాస, వశిష్ట, గాలవ, పరాశరాదులును, తేజో నిధులైన మైత్రేయ శరభంగాదులును, మహాతపస్సులైన గర్గ, కశ్యప, మాండవ్య, శౌనక, విశ్వామిత్రాదులును, జ్ఞానాధికులైన అత్రి, భృగు, కుత్స, వత్సక, తిత్తిరి, ఉద్దాలక, కపిల, చ్యవన, కణాద, గౌతమి, సుతీక్ష్ణ, జమదగ్ని, శ్వేతకేతు, శతానందులును ఒక సముదాయముగ చేరి ఆ మహాసత్ర యాగము జేయసాగిరి. ఆ సమయమున పౌరాణికోత్తముడైన సూతమహాముని యాగదీక్షను పొంది అక్కడి కరుదెంచెను.

అశేషవేదవేదాంత పరిశోధకుడును, సమస్త పురాణేతిహాసముల రహస్యముల నెరిగినవాడును, పులిచర్మమును ధరించినవాడును, జటామకుట శోభితుడై ప్రత్యక్ష పరమేశ్వరునివలె ప్రకాశించువాడునునైన ఆ సూతమౌనిని జూచి, శౌనకాది మహర్షులు అర్ఘ్యపాద్యాదులచే ఆయనను పూజించి, సుఖాసీనునిగావించిరి. వారు పుణ్యకథలను వినవలెనను కుతూహలంగలవారై "ఓ వ్యాస శిష్యవర్యా! మహానుభావా! పూర్వము నీచే సమస్తములైన పురాణోపపురాణములు, పురాణ లక్షణములు, ఇతిహాసములు మొదలైనవన్నియు ఉపన్యసింపబడినవి. విష్ణు - బ్రహ్మకైవర్తము - భవిష్య - భాగవత - లింగ - బ్రహ్మ - నారద - బ్రహ్మాండ - పద్మ - మార్కండేయ - అగ్ని - వరాహ - వామన - గరుడ - మత్స్య - కూర్మ - స్కాంద - వాయు - అను పదునెనిమిది మహా పురాణములును, సనత్కుమారము - నారసింహము - నారదీయము - శివపురాణము - దూర్వాసము - కపిలము - సాంబము - మానవము - ఔనసము - వారుణము - కాళికము - నంది - సౌరము - ఆదిత్యము - పరాశరము - మహేశ్వరము - భాగవతము - వాసిష్ఠము అను పదెనెనిమిది ఉపపురాణములును మరియు సర్గ - ప్రతిసర్గ - వంశము - మన్వంతరము - వంశానుచరితములను పురాణ పంచలక్షణములును మీచే సవిస్తరముగ చెప్పబడినవి. మహాపురాణములో స్కాందము అతివిచిత్రములైన కథలతో

ప్రసిద్ధిమైనది. ఆ సాంకదపురాణములోని ఉత్తర కాండములో వివరింపబడియున్న ద్విజానుసరణీయ సనాతన ధర్మములు, ఆత్మవిదులైన ద్విజులగాథలు, పాపపరిహారములైన రాజన్యుల చరిత్రలు పెక్కులు పూర్వము మీచే చెప్పబడినవి. ఇపుడు ఆదిశక్తియొక్క అవతార సంబంధమైన వైశ్యుల చరిత్ర యొకటి వినదగి యున్నది. కాని యిపుడా చరిత్రనూ, పరాశక్తియొక్క అవతారగాథలనూ, వైశ్యుల జీవన విధానములనూ, కలియుగమున నుండు వారి ఆచారవ్యవహారాదులను గూర్చి విశదముగ తెలియజేయుడు" అని ప్రార్థించిరి.

అంత పురాణపండిత శ్రేష్ఠుడైన సూతమౌని, "ఓ మహర్షులారా! మీరు సర్వము తెలిసినవారై యుండియు నాయందలి వాత్సల్యముతో నన్ను పెద్దజేసి యిట్లు అడుగుచున్నారు. నేనెరిగిన మేరకు మీకు విషయములను విన్నవించెదను." అని పలికి గురు నమస్కారము చేసి "పరా-పశ్యంతి- మధ్యమ-వైఖరి వర్ణరూపియై త్రిమూర్తులచే ఆరాధింపబడు భగవతి నా వాక్కు-నందలరు గాక" యని దేవిని ప్రార్థించి యీ విధముగచెప్పసాగెను.

## శ్రీ వాసవీదేవి పూర్వావతార క్రమము :

"ఓ మునిసత్తములారా! పూర్వమేదేవి మధుకైటభులను రాక్షసులను సంహరించినదో, కృతయుగమందు శుంభనిశుంభులను రక్కసులనేదేవి వధించినదో, దేవతలను జయించి వారి యువతులను బందీలను జేసి బాధించిన మహిషాసురుని యేదేవి మట్టుపెట్టినదో, త్రేతాయుగమున బాహుబల దర్పితుడై ధర్మమును అంతరింపజేసిన దుర్మదుడగు రావణాసురుని సంహరించుటకై శ్రీరాముని రూపమును ఏ లలితాంబ ధరించినదో, ఆ దేవియే ద్వాపరయుగములో యశోదాగర్భ సంభూతయై, శ్రీకృష్ణునకు సోదరియై అవతరించినది. కంసాది దానవులను వధింపజేసి 'శ్రీకన్యక'

నామముతో విరాజిల్లినది. ఆ శ్రీ కన్యయే కైలాసవాసులైన వైశ్యుల నాయకుడగు సోమదత్తునకు కీర్తికన్యయను పేర కుమార్తెయై జన్మించి, భండాసురాంశాసంజనితుడైన చిత్రకంఠుడను గంధర్వుని శాపగ్రస్తుని గావించినది. దుష్టుడైన ఆ చిత్రకంఠుడు కలియుగమున విష్ణువర్ధనుడను పేర భువిలో జన్మించి చక్రవర్తియై నిరంకుశుడై వర్తించనున్నాడు. యోగమాయా కన్యయే కలియుగములో కుసుంభుడను పేరుగల వైశ్యప్రభుని యింట ప్రభవించి, వాసవీకన్యానామమున ప్రసిద్ధిగాంచి, అధర్మవర్తనుడైన విష్ణువర్ధన రాజునంత మొందించనున్నది. కలియుగమున అధర్మ దుష్టత్వముల నంతరింపజేయుటకై దైవావతారులు అనుసరించవలసిన వినూత్న మార్గమును ప్రబోధించనున్నది. చతుర్విధ పురుషార్థములను సాధించుటకనువైన వర్ణాశ్రమాచార విలసితమగు ఆర్షధర్మమును పరిరక్షించుటకై బంధువులతో గూడి అగ్ని ప్రవేశ మొనర్చి, తనతో వచ్చువారికి మోక్షమును ప్రసాదించనున్నది. కలియుగ పాపములను పోగొట్టగల శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి భావిచరిత్రను మీ శ్రేయస్సుకై ప్రీతితో ప్రకటించుచున్నాను. సమాహితచిత్తులై వినుడు" అని సూతుడు శౌనకాది మునులకు చెప్పెను అని పలుకుచు సాలంకాయనముని మణిగుప్తాది వైశ్యోత్తములకు ఇట్లు తెలియజేయసాగెను.